క్లుప్తంగా

మహిళలకు కుట్టు శిక్షణ అభినందనీయం



ముసునూరు: మారుమూల పల్లెల్లోని మహిళలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, వారిని స్వయం ఉపాధి దిశగా అభివృద్ధి చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ అన్నారు. మండలంలోని రమణక్కపేటలో హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ సుపీరియర్ మేరీ మెటిల్డా ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షురాలు జయమేరి అధ్యక్షతన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆరు నెలలు శిక్షణ పూర్తిచేసుకున్న 23 మందికి డిప్లొమో సర్టిఫికెట్లతో పాటు కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ జాన్ భారతి, ట్రైనింగ్ ఇన్‌చార్జ్ సిస్టర్ మిల్‌రెడ్ పాల్గొన్నారు.

మెలకువలతో ఆంగ్ల భాషపై పట్టు

తిరువూరు: విద్యార్థులు ఇంగ్లిష్ సబ్జెక్టు అంటే భయపడాల్సిన అవసరం లేదని, ఆసక్తితో నేర్చుకుంటే ఇంగ్లిష్‌లోనూ ఎక్కువ మార్కులు సాధించవచ్చని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం కన్వీనర్ ఎం. రాంప్రదీప్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టోఫెల్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో భాగంగా ఐబీ, టోఫెల్ వంటి విధానాలు ప్రవేశపెడుతోందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ఎన్ఎల్ఈపీ జెడీ దేవసాగర్



నూజివీడు: కుష్ఠు వ్యాధిని సకాలంలో గుర్తించి మందులు వాడటం ద్వారా పూర్తిగా తగ్గించవచ్చని జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్ఎల్ఈపీ) జాయింట్ డైరెక్టర్ ఎస్. దేవసాగర్ అన్నారు. గురువారం ఆయన నూజివీడు మండలం దిగవల్లి, ముసునూరు మండలం రమణక్కపేట, ముసునూరు పీహెచ్‌సీల పరిధిలో కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. పాత కుష్ఠు వ్యాధిగ్రస్తుల కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూనే నూతన వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.శ్రీనివాస్, కరీముల్లా, అవినాష్, షకీనా, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



ముసునూరు: మండల వ్యాప్తంగా క్రైస్తవులు క్రీస్తు శ్రమ దినాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ముసునూరు, రమణక్కపేట, చింతలవల్లి ఆర్‌సీఎం చర్చిల్లో పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరై భస్మ బుధవారాన్ని పాటిస్తూ 40 రోజుల దీక్షలను స్వీకరించారు. సాయంత్రం, రాత్రి దివ్య పూజాబలి సమర్పణ కార్యక్రమాలను నిర్వహించి దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. చింతలవల్లి ఉపదేశి బెనర్జీ మాట్లాడుతూ క్రైస్తవులు క్రీస్తు శ్రమలు, పాట్లు గుర్తు చేసుకుంటూ 40 రోజులు కఠిన నియమాలతో క్రీస్తును పోలిన జీవితాన్ని పవిత్రంగా గడుపుతారని వివరించారు.

ఎన్టీటీపీఎస్ కాలుష్యాన్ని నివారించాలి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ముత్తవరపు కల్యాణ మండపంలో కాలుష్యం నివారణపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లా డుతూ కాలుష్యం ధాటికి గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. మొక్కు బడిగా వైద్య శిబిరాలు, మొక్కల నాటడం వంటి కార్యక్రమాలు కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలుష్యం నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నగరోత్సవం

నందిగామ: పట్టణంలో లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామివార్ల నగరోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల విగ్రహాలతోపాటు పలు దేవతామూర్తుల విగ్రహాలను ఉంచి పట్టణంలోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాల నడుమ నగరోత్సవం సందడిగా సాగింది.

గ్రంథాలయంలో చదువులు.. ప్రభుత్వ కొలువులు



తిరువూరుకు చెందిన సోమవరపు కృష్ణ కవిత అను నేను డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగ సాధనకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యా. ఎటువంటి కోచింగ్ లేకుండా ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉండేది. తిరువూరు శాఖా గ్రంథాలయంలోని పుస్తకాల విభాగంలో పోటీ పరీక్షల మెటీరియల్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు చదివా. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ఉద్యోగాలకు నిర్వహించిన రాత పరీక్షలో పాల్గొన్నాను. రాత పరీక్షలో ఉత్తీర్ణురాలై క్లరికల్ కేడర్ ఉద్యోగం సాధించా. ఉద్యోగ సాధనలో గ్రంథాలయం తనకు ఎంతగానో ఉపయోగపడింది. గ్రంథాలయానికి దాతలు పుస్తకాలు సమకూరుస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు



తిరువూరు పట్టణానికి చెందిన అంజిబాబు అను నేను ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా చదివా. దీనిలో భాగంగా పోటీ పరీక్షలకు దరఖాస్తు చేస్తూ స్వయంకృషితో రైల్వే ఉద్యోగం సాధించా. నా కల నెరవేరింది. తొలి ప్రయత్నంలోనే తనకు రైల్వే ఉద్యోగం రావడానికి తిరువూరు శాఖా గ్రంథాలయంలోని పోటీ పరీక్షల మెటీరియల్ ఎంతగానో ఉపకరించింది. వీటిని సరఫరా చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థకు, పుస్తకాలు సమకూరుస్తున్న దాతలకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- నిరుద్యోగులకు వరంగా తిరువూరు గ్రంథాలయం
- పోటీ పరీక్షల మెటీరియల్‌తో ఉద్యోగాలు సాధిస్తున్న యువత
- కోచింగ్ లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపకరిస్తున్న పుస్తకాలు
- పాఠకులతో కిటకిటలాడుతున్న గ్రంథాలయం

తిరువూరు: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనేది యువత కల. ఆ కలను సాకారం చేసుకునేందుకు తిరువూరులోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయం యువతకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వోద్యోగాలకు నెలకొన్న తీవ్రమైన పోటీలో ఎటువంటి శిక్షణా లేకుండా తిరువూరు ప్రాంత నిరుద్యోగ యువత గ్రంథాలయంలో మెటీరియల్‌ను చదివి ఉద్యోగాలు సాధిస్తున్నారు. గత ఏడాది కాలంలో పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వెలువడిన నోటిఫికేషన్లకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్న యువతీ, యువకులు తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలోని పోటీ పరీక్షల విభాగంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సరఫరా చేసిన పలు నాణ్యమైన మెటీరియల్‌ను సాధన చేసి విజయం సాధించారు. తిరువూరు గ్రంథాలయంలో పాఠకులకు కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయం ఉంది. కరెంటు సరఫరాకు అంతరాయం కలిగితే జనరేటర్ ఉపయోగించుకునే సదుపాయం కల్పించారు.



తిరువూరు గ్రంథాలయంలో పోటీపరీక్షల మెటీరియల్ సాధన చేసి ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులను సన్మానించిన దృశ్యం (ఫైల్)

స్వయం కృషితో ఉద్యోగాల సాధన

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైకోర్టులు, సబార్డినేట్ కోర్టులలో జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పోటీ పరీక్షల్లో పది మందికి పైగా యువకులు ఎంపిక కావడం విశేషం. ఏపీ పోలీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎంపిక పరీక్షల్లో సైతం ఇరువురు యువకులు గ్రంథాలయంలోని పోటీ పరీక్షల మెటీరియల్ చదివి విజయం సాధించారు. దక్షిణ మధ్య రైల్వేలో గ్రూప్–డీ, నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీలలో పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసిన ముగ్గురు అభ్యర్థులు గ్రంథాలయ పోటీ పరీక్షల మెటీరియల్‌తోనే విజయం సాధించడం గమనార్హం. ఇటీవల గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, అధికారులు తమ గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్ సాధన చేసి స్వయంకృషితో ఉద్యోగాలు సాధించినందుకు వారిని అభినందించారు. యువత గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోటీ పరీక్షలకు నాణ్యమైన మెటీరియల్ అందిస్తున్నాం



పేద నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన మెటీరియల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ అందిస్తోంది. నాణ్యమైన ఈ మెటీరియల్‌ను చదివి నిరుద్యోగులు తమ లక్ష్యాన్ని సాధించాలి. తిరువూరు గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులు చదువుకునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాం. పలువురు దాతలు సైతం పోటీ పరీక్షల పుస్తకాలను వితరణగా ఇస్తున్నారు.

– కోగంటి పద్మావతి, గ్రంథాలయాధికారి

బాలరావమ్మ తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరణ



నూజివీడు: దుగ్గిరాల బాలరావమ్మ అమ్మవారి తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని దుగ్గిరాల బాలరావమ్మ అమ్మవారి తిరునాళ్లను ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గుడి చైర్మన్ వీరంకి వీరాంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు సింహాద్రి నాగబాబు, గుడి కమిటీ సభ్యులు పామర్తి శివ, దాసరి శరత్‌బాబు, ఆరేపల్లి రాంబాబు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు

తిరువూరురూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పేదలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోకిలంపాడు, మల్లేల, లక్ష్మీపురం, మునుకుళ్ల, వావిలాల, ఎర్రమాడు, రోలుపడి, చింతలపాడు గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతోందని వివరించారు.

రూ.9.25 కోట్ల మిగులు బడ్జెట్

- నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం
- వాగ్వాదాలతో దద్దరిల్లిన కౌన్సిల్ సమావేశం

నూజివీడు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూజివీడు పురపాలక సంఘం రూ.9.25 కోట్ల మిగులు బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన స్థానిక పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రారంభ నిల్వ రూ.10,49,08,460 కాగా, ఆదాయం రూ.65.08 కోట్లు గానూ, ఖర్చు రూ.66.32 కోట్లుగాను అంచనా వేశారు. మొత్తంలో నుంచి ఖర్చు పోగా రూ.9.25 కోట్లు మిగులుగా అంచనా వేసి బడ్జెట్‌ను కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టగా దానిని సభ్యులు ఆమోదించారు. ఆస్తి పన్ను రూ.5.70 కోట్లు వస్తుందని, ఎంపీ లాడ్స్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే గ్రాంట్లు, ఎస్ఎఫ్‌సీ, స్పెషల్ డెవలప్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రకృతి వైపరీత్యాల గ్రాంటు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు తదితరాలు కలిపి రూ.46.24 కోట్లు రావొచ్చని అంచనా వేశారు.

అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కౌన్సిల్ మీటింగ్‌హాల్ అరుపులు, కేకలతో దద్దరిల్లింది. బడ్జెట్‌లో కేటాయింపులపై టీడీపీ కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్ విమర్శలు చేస్తుండగా, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ కలుగచేసుకుని బడ్జెట్ అంటే అంచనా మాత్రమేనని, అంచనాలను ప్రశ్నించాల్సిన పనిలేదన్నారు. దీంతో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూజివీడు వచ్చి రూ.16 కోట్లు మంజూరు చేశారని, టీడీపీ ప్రభుత్వం గతంలో నూజివీడుకు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. దీనికి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రూ.200 కోట్లతో నూజివీడుకు టిడ్కో గృహాలను ఇచ్చామని అనగా.. టిడ్కో గృహాల వల్ల లబ్ధిదారులందరూ అప్పులపాలయ్యారన్నారు.అందులో రూ.500 చెల్లించిన గృహాల లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ చేసి ఉచితంగా అందజేశారని పగడాల సత్యనారాయణ బదులిచ్చారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ నోటుకు ఓటు కేసులో పట్టుబడి పదేళ్లు రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను చంద్రబాబు వదిలేసి వచ్చారని, ఈ విషయం రెండు రాష్ట్రాల ప్రజలకు తెలుసునన్నారు. ఒకరిపై ఒకరు విమర్శలు మానుకుని అందరూ కలిసికట్టుగా పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కౌన్సిలర్లు శీలం రాము, నడకుదురు గిరీష్, నవుడు నాగమల్లేశ్వరరావులు బడ్జెట్‌పై ప్రసంగించారు.





సమావేశంలో పగడాల సత్యనారాయణ, చెరుకూరి దుర్గాప్రసాద్ మధ్య వాగ్వాదం (ఇన్‌సెట్) కౌన్సిల్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

వైస్ చైర్మన్ రాజీనామాకు ఆమోదం

మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ తన పదవికి చేసిన రాజీనామాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. వ్యక్తిగత కారణాల వల్ల ఆయన ఈనెల 12న మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా లేఖను అందజేశారు. సమావేశంలో కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌బీఆర్‌సీఈకి ఉత్తమ శిక్షణ విద్యాలయ అవార్డు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (ఎల్‌బీఆర్‌సీఈ) ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) వారిచే ఉత్తమ శిక్షణ విద్యాలయ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌బీఆర్‌సీఈలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజినీరింగ్ అండ్ ఐటీ స్కిల్ వర్క్‌షాపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలలకు ప్రోత్సాహక అవార్డులు ప్రదానం చేశారన్నారు. సాంకేతిక నైపుణ్య శిక్షణ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరు కళాశాలలకు ఉత్తమ విద్యాలయాలు అవార్డులను ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ద్వారా ప్రదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 240 కళాశాలలు పాల్గొన్నాయని, అందులో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు ఉత్తమ విద్యాలయ అవార్డు లభించిందని వివరించారు. ఇందుకు తోడ్పడిన అధ్యాపకులను పలువురు అభినందించారు.



ఉత్తమ విద్యాలయ అవార్డుతో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అధ్యాపకులు

కిడ్నీ ప్రభావిత గ్రామాలకు కృష్ణా జలాలు సరఫరా చేస్తున్నాం

జెడ్పీటీసీ భూక్య గనియా

ఎ.కొండూరు: మండలంలో కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో 52 ట్యాంకులు ఏర్పాటు చేసి కుదప సంప్ నుంచి కృష్ణా జలాలను ట్యాంకర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని జెడ్పీటీసీ భూక్య గనియా తెలిపారు. చీమలపాడు గ్రామంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. శాశ్వత పరిష్కారానికి రూ. 49 కోట్లతో తాగునీరు త్వరలో అందిస్తామన్నారు. కిడ్నీ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డయాలసిస్ కేంద్రం, డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు పింఛన్, ఉచిత మందులు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద ప్రజల సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టి పార్టీలకు అతీతంగా మంజూరు చేస్తున్నారన్నారు.

స్థానికంగా లేని వలస టీడీపీ నేత కొలికపూడి శ్రీనివాసరావు అమరావతి నుంచి ఈ మండలానికి వచ్చి తాగునీటి కోసం పాదయాత్రలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రాంత కిడ్నీ రోగులకు గత టీడీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ స్థాయిలో కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

చాట్రాయి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం మండలంలోని గంటిపాడు తండాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు మంగయ్య మాట్లాడుతూ 1739లో బ్రిటిష్ ప్రభుత్వం లంబాడీలపై విధించిన క్రిమినల్ చట్టాన్ని వ్యతిరేకించి వారి హక్కుల కోసం సేవాలాల్ పోరాడారని వివరించారు. అనంతరం సేవాలాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కరరావు పేరయ్య, మోహనరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమం కిలేశపురంలో గురువారం జరిగింది. ఆయన చిత్ర పటానికి వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికత జోడించి గిరిజనులను చైతన్యవంతులను చేసిన మహోన్నత వ్యక్తి సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. నేటి యువతరం ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాణావత్ బాలాజీ, పంచాయతీ వార్డు సభ్యుడు ధారావత్ కృష్ణ, పంతులు నాయక్, మంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కిలేశపురంలో నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ నాగబాలమ్మ, గిరిజన నాయకులు

గడప గడపకు నిధులతో రోడ్డు నిర్మాణం

తిరువూరు: 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించనున్న సీసీ రహదారి పనులను గురువారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ప్రారంభించారు. పట్టణంలోని అన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరి, కమిషనర్ లోవరాజు, వార్డు కౌన్సిలర్లు సత్యనారాయణ, ప్రసాద్, మూడు దుర్గారావు, షేక్ నదియా పాల్గొన్నారు.

పంచాయతీ అనుమతుల ప్రకారమే ఇళ్లు నిర్మించాలి

విస్సన్నపేట: గ్రామ పంచాయతీ ఇచ్చిన అనుమతుల ప్రకారమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు జారీ చేస్తామని ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి అన్నారు. స్థానిక ఇందిరా నగర్‌కు వెళ్లే రహదారి పక్కన నూతనంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనానికి పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేస్తుండటంతో గురువారం స్థానిక ఇందిరా నగర్ వాసులు కొందరు అధికారులకు సమాచారం ఇచ్చి నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈఓపీఆర్డీ నిర్మాణం పనులను పరిశీలించి పంచాయతీ ఇచ్చిన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేస్తుండటంతో పనులు నిలుపుదల చేయాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎ.కొండూరు: చీమలపాడు పీఏసీఎస్ పరిధిలోని కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు బి. చంద్రు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సీఈఓలు వెలుగు కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమోహన్‌రావు, ఎంపీటీసీ భూక్య వెంకటేశ్వరరావు, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.

- **ఎ.కొండూరు:** మృతుని కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అన్నారు. రేపూడి తండాకు చెందిన ఎల్. శ్రీనివాస్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని మట్టి ఖర్చుల నిమిత్తం రూ. ఐదు వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, సర్పంచ్ చంటి, ఎంపీటీసీ కేశియా పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రావు

రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల సందర్భంగా స్వామివారి దివ్య రథానికి వంశపారంపర్య ధర్మకర్త ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి దివ్య రథాన్ని స్వామి వారి కల్యాణ మండపానికి తరలించారు. అనంతరం ఆలయంలో స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కల్యాణ మండపానికి రథం తరలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, భక్తులు

వసతిగృహం తనిఖీ

జుజ్జూరు(వీరులపాడు): వసతి గృహాల్లోని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ రాజకిషోర్ సూచించారు. మండలంలోని జుజ్జూరు సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనమందించాలని వార్డెన్‌కు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం

ఆగిరిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లిలోని సహకార బ్యాంక్ ఆవరణలో జనరిక్ మెడికల్ షాపును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనరిక్ మందుల షాపుల్లో అతి తక్కువ ధరలకు మందులు లభిస్తాయని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మరియమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలోని కాసరబాద గ్రామం గురువారం శ్రీరామ నామస్మరణ మార్మోగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతా సమేత కోదండ రామచంద్ర స్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాది క్రతువులు నిర్వహించిన అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పూజలు చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు..

కోదండ రామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో నిర్వహించిన హోమాది పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ నిర్మాణానికి రూ.50 వేలను అందించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, పారుపల్లి హరిబాబు, గుడేటి శ్రీను, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భార్యను హింసిస్తున్న భర్తపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: వేరే మహిళతో సహజీవనం చేస్తూ భర్త తనను హింసిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన టి.హారిక ఇబ్రహీంపట్నంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఆమె భర్త దశరథరామయ్య విజయవాడలో ప్రముఖ జ్యుయలరీ షాపులో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కృష్ణలంకకు చెందిన మరో మహిళతో అతను సహజీవనం చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలను పట్టించుకోవడం లేదు. భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. ఈ మేరకు బాధితురాలైన దశరథరామయ్య భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొండపల్లి సెక్టార్ ఎస్ఐ పాపారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రేత అరెస్ట్

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడిచేసి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్లగుంట శివారు సింహాద్రిపురంలో సీహెచ్ ప్రసాదరావు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎస్ఐ వాసు సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. 9 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శుక్రవారం నూజివీడు కోర్టులో హాజరుపరుస్తారు.